
సాక్షి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 16 । జూలై । 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో శనివారం నాటికి 25.680 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 899 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,180
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,494
3 శాతం జీఎస్టీతో..	రూ.5,659
నవర (8 గ్రా)	రూ.45,272

గరిష్టం/కనిష్టం
37.5 /29.2

వాతావరణం

శనివారం గాలిలో తేమ 45 శాతం ఉంది. ఆదివారం జిల్లావ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

చెక్‌పోస్టులో ఆన్‌లైన్ చెల్లింపులు

నెల్లూరు(టౌన్): రవాణాశాఖకు సంబంధించి తాజాగా చెక్‌పోస్టులో ఆన్‌లైన్ చెల్లింపులు అమలులోకి వచ్చాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లా తడ చెక్‌పోస్టులో ఇప్పటి వరకు మాక్సీక్యాబ్, మోటార్ క్యాబ్ తదితర వాహనాలకు చెక్‌పోస్టులోనే తాత్కాలిక టాక్స్‌ను చెల్లించి ఇతర ప్రాంతాలకు వెళుతున్న పరిస్థితి ఉంది. అయితే ప్రస్తుతం అన్ని లావాదేవీలను ఆన్‌లైన్‌లోనే చెల్లించేలా మార్పులు తీసుకువచ్చారు. గత రెండు రోజుల నుంచి ఈ ప్రక్రియను అమలు చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో చెల్లించేలా అధికారులు వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు.

759 పొగాకు బేళ్ల కొనుగోలు



కొనుగోలు చేసిన పొగాకు బేళ్లు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శనివారం మర్రిపాడు క్లస్టర్‌కు చెందిన రైతుల నుంచి 759 పొగాకు బేళ్లు కొనుగోలు చేశామని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. మొత్తం 786 బేళ్లు వేలానికి తీసుకురాగా, వాటిలో 27 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన పొగాకు బేళ్లకు సంబంధించి రూ.2,28,28,528 రైతులకు చెల్లించనున్నట్లు తెలిపారు. కాగా కిలో పొగాకు అత్యధిక ధర రూ.245, అత్యల్ప ధర రూ.150, సగటు ధర రూ.231.62గా నమోదైనట్లు తెలిపారు.

ప్రతి సెంటూ పక్కాగా..



- ప్రతిష్టాత్మకంగా భూముల రీసర్వే
- దశాబ్దాలుగా పేరుకుపోయిన భూ సమస్యలకు పరిష్కారం
- విజయవంతంగా కొనసాగుతున్న ప్రక్రియ
- తొలిదశలో జిల్లాలో 117 గ్రామాల్లో రీసర్వే పూర్తి
- ఆగస్టు 31 కల్లా మరో 100 గ్రామాల్లో పూర్తి చేసేలా చర్యలు

ప్రతి గ్రామంలో భూ సమస్యలు సర్వసాధారణమైన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం భూముల రీ సర్వేను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. గతంలో ఎందరో రైతులు ఏళ్ల తరబడి అధికారుల చుట్టూ తిరిగినా పరిష్కారం కాని సమస్యలకు కూడా రీ సర్వే ద్వారా పరిష్కారం లభించనుంది. భూవివాదాలు, సరిహద్దు సమస్యలు, మ్యుటేషన్లు, సబ్ డివిజన్లు, నిషేధిత ఆస్తులు, వారసత్వం వంటి ఎన్నో చిక్కుముడులను కూడా పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.



రాపూరు మండలం సిద్దవరంలో రీసర్వే పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎం.హరినారాయణన్ (ఫైల్)

నెల్లూరు(దర్గామిట్ట): శతాబ్ద కాలంగా దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి భూముల రీసర్వేకు శ్రీకారం చుట్టి ఆ ప్రక్రియను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న భూముల రీసర్వే ద్వారా జిల్లాలో దాదాపు 9,700 సమస్యలు పరిష్కారమవుతున్నాయని తెలుస్తోంది. భూవివాదాలు, సరిహద్దు సమస్యలు, మ్యుటేషన్లు, సబ్ డివిజన్లు, నిషేధిత ఆస్తులు, వారసత్వం వంటి ఎన్నో చిక్కుముడులకు రీసర్వే సమాధానం చెబుతోంది. ఏళ్ల తరబడి అధికారుల చుట్టూ తిరిగినా పరిష్కారం కాని వందలాది సమస్యలను రీసర్వే బృందాలు ప్రతి గ్రామంలో పరిష్కరిస్తున్నాయి. కలెక్టర్ ఎం.హరినారాయణన్ గ్రామాల్లో రీసర్వే పటిష్టంగా, సమగ్రంగా జరిగేలా ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తున్నారు. రీసర్వే జరిగిన తీరు, రైతులకు కలిగిన ప్రయోజనాలను ఆయా గ్రామాల్లో చూస్తుంటే భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగకరంగా ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు స్పష్టమవుతోంది. రీసర్వే జరిగిన గ్రామాల్లో ఎన్నో భూవివాదాలు సమస్యలు పరిష్కారమైనట్లు తెలుస్తోంది.

తొలిదశలో 117 గ్రామాల్లో..

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు - భూరక్ష కార్యక్రమంలో భాగంగా తొలిదశలో జిల్లాలో 117 గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ పూర్తయింది. అనంతరం 110 గ్రామాల్లో ఆగస్టు 31వ తేదీ నాటికి రీసర్వే ప్రక్రియ పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో తాజా రికార్డులతో డిజిటల్ రికార్డులు అందుబాటులోకి వచ్చాయి. ప్రతి భూకమతాన్ని కొలిచి అక్షాంశ, రేఖాంశాలతో సర్వే బృందం హద్దులను నిర్ణయిస్తోంది. హద్దుల్లో ప్రభుత్వ ఖర్చులతోనే సర్వే రాళ్ల ఏర్పాటు చేస్తున్నారు. అధికారులు ప్రతి రైతుకు భూహక్కు పత్రం అందజేస్తున్నారు. రైతుల భూములకు సంబంధించి ఆధార్ మాదిరిగా ఒక విశిష్ట సంఖ్య(యూనిక్ కోడ్)ను కేటాయించారు. భూహక్కు పత్రంలోనే క్యూఆర్ కోడ్ ముద్రించారు. దానిని స్కాన్ చేసి భూవివరాలను ఎప్పుడైనా తెలుసుకునే అవకాశాన్ని కల్పించారు.

డ్రోన్ సర్వే పూర్తి

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని గ్రామాల్లో అధికారులు డ్రోన్ సర్వే పూర్తి చేశారు. గ్రామాల్లో రీసర్వే జరుగుతున్న సమయాల్లో గ్రామ సర్వేయర్, వీఆర్వో, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ల బృందం వెళ్లే ముందుగా దండోరా వేయించి రైతులకు రీసర్వే విషయాన్ని తెలియపరుస్తారు. రీసర్వే సమయంలో రైతులు పూర్తి డాక్యుమెంట్లను సర్వే బృందానికి అందించి వివరాలు తెలియజేయడం ద్వారా భూసమస్యలకు పరిష్కారం లభిస్తోంది.

బార్ కోడింగ్‌తో భూహక్కు పత్రం

ఇప్పటి వరకు మన పూర్వీకుల నుంచి వచ్చిన పాస్ పుస్తకాలకు, ప్రస్తుతం ఉన్న పట్టాదారు పాస్‌పుస్తకాలకు స్వస్తి పలకనున్నారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో బార్ కోడింగ్‌తో కలిగిన భూహక్కు పత్రం రైతులకు జారీ చేయడం జరుగుతుంది. దీంతో తమ భూమి వివరాలు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం కావడంతోపాటు పరిశీలన మరింత సులభతరం కానుంది.

రీ సర్వే వల్ల ప్రయోజనాలు

- సర్వే పూర్తయిన 117 గ్రామాల్లో తుది ఆర్‌ఓఆర్‌లు(రికార్డ్ ఆఫ్ రైట్స్) సిద్ధం
- దాదాపు 42,000 మందికి భూహక్కు పత్రాలు
- హద్దుల్లో 1,62,903 సర్వే రాళ్ల ఏర్పాటు
- 53,565 మంది రైతుల పేర్లు తొలిసారిగా రికార్డుల్లోకి..
- 117 గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు
- 9,700లకు పైగా సరిహద్దు వివాదాలు పరిష్కారం



అనంతసాగరంలో హద్దురాళ్లు ఏర్పాటు చేస్తున్న సర్వే సిబ్బంది (ఫైల్)

అత్యాధునిక టెక్నాలజీతో..



దేశంలో వందేళ్ల తరువాత ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే భూముల రీసర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సర్వేను ఇతర రాష్ట్రాలు మోడల్‌గా తీసుకుంటున్నాయి. సర్వే కోసం అత్యాధునిక టెక్నాలజీ వినియోగిస్తున్నాం. గ్రామాల్లో సర్వే బృందం వచ్చినప్పుడు రైతులు సహకరించాలి.
– అన్నవరం హనుమాన్ ప్రసాద్, ఏడీ సర్వే, నెల్లూరు



దరఖాస్తుదారుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

సంక్షేమంలో ఏపీ దిక్సూచి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోని అన్ని రాష్ట్రాలకు దిక్సూచిలా నిలిచిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రం వెంకటాచలంలో నూతనంగా నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని మంత్రి కాకాణి శనివారం ప్రారంభించారు. అనంతరం వెంకటాచలం, నిడిగుంటపాళెం గ్రామాల్లో 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించి దరఖాస్తుదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలను ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్నామని తెలిపారు. అర్హులైన ఏ ఒక్కరూ సంక్షేమ పథకాలకు దూరం కాకుడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరిస్తూ వారికి అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లను ప్రభుత్వం గ్రామాల్లోనే అందజేస్తోందని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలకు సంబంధించిన ప్రయోజనాన్ని పారదర్శకంగా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తుంటే.. బటన్ నొక్కి సంక్షేమ పథకాలు అందిస్తే సరిపోతుందా అంటూ ప్రతిపక్షనేత చంద్రబాబు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇంతకన్నా ఎక్కువగా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చంద్రబాబు మాట్లాడడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓట్లు దండుకుని ప్రజలను మోసం చేయాలనే ఆలోచన తప్ప ప్రజలకు మేలు చేసే ఉద్దేశం చంద్రబాబుకు లేదని విమర్శించారు. చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ వలంటీర్ వ్యవస్థపై విమర్శలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికే చంద్రబాబు నడ్డివిరిచిన ప్రజలు, 2024 ఎన్నికల్లో మరోసారి ఇంటికి పంపడం ఖాయమన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు

సర్వేపల్లి నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యలు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కాకాణి పేర్కొన్నారు. దశాబ్దాల కాలం నాటి చుక్కల భూముల సమస్యలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కారం చూపడంతో జిల్లాలో వేలాది రైతులకు మేలు చేకూరిందని తెలిపారు. అలాగే ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములకు సంబంధించి 20 ఏళ్ల వరకు లబ్ధిదారుల ఆధీనంలో ఉన్న భూములను పట్టా భూములుగా మార్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ నిర్ణయంతో పేద రైతులకు మరింత భరోసా ఏర్పడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా నిడిగుంటపాళెం గ్రామంలో చుక్కల భూముల సమస్య నుంచి విముక్తి పొందిన రైతులకు మంత్రి చేతులమీదుగా ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, జిల్లా వ్యవసాయశాఖాధికారి సుధాకర్‌రాజు, తహసీల్దార్ కృష్ణ, ఎంపీపీ మందా కవిత, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, నాయకులు మందల పెంచలయ్య, కట్టంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, విజయ్ కుమార్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, కొణిదెన మోహన్‌నాయుడు, విజయభాస్కర్‌నాయుడు, వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, అడపాల ఏడుకొండలు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

కోటంరెడ్డి సోదరులకు ఎదురుదెబ్బ

- ఎంపీ ఆదాల సమక్షంలో వైఎస్సార్‌సీపీలో వెయ్యి మంది చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో టీడీపీ తన ఉనికిని కోల్పోతోంది. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరిన అనంతరం నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలు ప్రాంతాలకు చెందిన వారు అధిక సంఖ్యలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. శనివారం రాత్రి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి అనుచరులు, నెల్లూరు రూరల్ పరిధిలోని 28వ డివిజన్‌కు చెందిన కొండిశెట్టి జగదీష్, 22వ డివిజన్‌కు చెందిన గుంజి రవి ఆధ్వర్యంలో పేర్నాటి ప్రసాద్, అజయ్, చరణ్‌రెడ్డి, పవన్, రాములతోపాటు సుమారు వెయ్యి మంది యువకులు ఎంపీ ఆదాల నివాసంలో ఆయన సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. అంతకుముందు భారీ ర్యాలీ నిర్వహించి ఆదాల నివాసం ఎదుట బాణసంచా కాల్చి సంబరాలు చేశారు. భారీ గజమాలతో ఎంపీ ఆదాలను సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు సమష్టిగాకృషి చేయాలని పిలుపునిచ్చారు. యువతకు వైఎస్సార్‌సీపీలో సముచిత స్థానం కల్పిస్తామని, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కార్పొరేటర్లు విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రైల్వే బోర్డు మెంబర్ వెంకయ్య, మర్రిపాడు జెడ్పీటీసీ సభ్యుడు మల్లు సుధాకర్‌రెడ్డి, టీవీఎస్ కమల్, కాలేషా, రఫీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేతలు



ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలు మంజుల తదితరులు

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న సమక్షంలో చేరిక

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని ఇస్కపాళెంకు చెందిన టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలు చౌటూరు మంజుల, ఆమె భర్త మోహన్, కల్లూరు వాణి ఆ పార్టీకి రాజీనామా చేసి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సమక్షంలో నెల్లూరులోని ఆయన నివాసంలో శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతోపాటు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాల పట్ల ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్ కుమార్, డీసీఎమ్మెస్ చైర్మన్ వీర చలపతిరావు, డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలిత, కౌన్సిలర్లు మల్లారెడ్డి, జయంతి, యానాదిరెడ్డి, చీర్ల ప్రసాద్, నాయకులు కోడూరు మధుసూదన్‌రెడ్డి, కావలి వెంకటేశ్వర్లు, మోర్ల మురళి, పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు పాల్గొన్నారు.

ప్రజలతోనే వైఎస్సార్ కుటుంబం

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబంలో ముగ్గురు వ్యక్తులు పాదయాత్ర చేయడం చరిత్ర అని, ఆ కుటుంబం ఎప్పుడూ ప్రజల వెంటే ఉంటూ వారి అభ్యున్నతికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని 1వ సచివాలయంలో శనివారం నిర్వహించిన 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పలువురికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజలకు మరింత చేరువ చేసేలా 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని అమలు చేస్తూ అవసరమైన వారికి ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నట్లు తెలిపారు.

నేడు కాపు భవన్ ప్రారంభం

- ప్రారంభించనున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి అంబటి రాంబాబు



ప్రారంభోత్సవానికి సిద్ధమైన కాపు భవన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్ద రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన కాపు భవన్‌ను రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అంబటి రాంబాబు చేతులమీదుగా ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, సభాధ్యక్షుడిగా నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి వ్యవహరించనున్నారు. వీరితోపాటు బోర్డ్ ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ చైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నగర మేయర్ స్రవంతి, కలెక్టర్ హరినారాయణన్, రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు పాల్గొననున్నారు.

గృహనిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

- ఏపీ గృహనిర్మాణ సంస్థ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శివప్రసాద్



అధికారులతో మాట్లాడుతున్న ఏపీ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శివప్రసాద్

నెల్లూరు(బారకాసు): జిల్లా పరిధిలోని అన్ని జగనన్న కాలనీల్లో గృహనిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణ సంస్థ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.శివప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలోని ఏపీకే అబ్దుల్ కలాం సమావేశ మందిరంలో కమిషనర్ వికాస్‌మర్మత్‌తో కలిసి సంబంధిత అధికారులతో గృహ నిర్మాణాల ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీ లేఅవుట్లలో అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర వసతులు కల్పించేందుకు అదనపు కార్మికులతో నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు. వంద శాతం నిర్మాణ పనులు పూర్తయిన గృహాలను లబ్ధిదారులకు అందజేయాలని సూచించారు. రూఫ్ నిర్మాణం పూర్తి అయిన గృహాలకు స్వయం సహాయక గ్రూపుల ద్వారా రుణాన్ని వడ్డీ లేకుండా అందించనున్నామని, ఆ మొత్తంతో ఫినిషింగ్ పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లు అందజేయాలని పేర్కొన్నారు. అనంతరం వెంకటేశ్వరపురంలోని జగనన్న కాలనీ లేఅవుట్లలోని గృహనిర్మాణాలను ఆయన పరిశీలించారు. సమావేశంలో కావలి, కందుకూరు, ఆత్మకూరు, మున్సిపాలిటీలు, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ అధికారులు, హౌసింగ్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు, నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయ అమెనిటీస్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై బాజిరెడ్డి

ఉలవపాడు: రైతుల పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను దొంగిలించి అందులో ఉన్న కాపర్ వైరును అమ్ముకునే దొంగలను ఉలవపాడు ఎస్సై బాజిరెడ్డి తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలోని పలు మండలాల్లో రైతుల పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను దొంగిలించి ఆటోలో తీసుకుని వెళ్లి వాటిని పగులగొట్టి అందులో ఉన్న కాపర్ వైరును దొంగిలించే ముఠాను సిబ్బందితో కలిసి పట్టుకున్నట్లు తెలిపారు. కావలికి చెందిన ముంగి ఏసుదాసు, పట్టపు వెంకటేశ్వర్లు, పట్టపు వెంకటేష్ ఆటోలో వచ్చి ట్రాన్స్‌ఫార్మర్లను దొంగతనం చేసి కావలిలోని తిరుపాలు అనే వ్యక్తికి అమ్మేవారన్నారు. ఇలా నెల్లూరు జిల్లా పరిధిలోని ఉలవపాడు మండలంలో 16 ట్రాన్స్‌ఫార్మర్లు, గుడ్లూరు మండలంలో 4 ట్రాన్స్‌ఫార్మర్లు, జలదంకి మండలంలో 3 ట్రాన్స్‌ఫార్మర్లు, బిట్రగుంట మండలంలో ఒక ట్రాన్స్‌ఫార్మర్, వింజమూరులో ఒక ట్రాన్స్‌ఫార్మర్ దొంగిలించినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి 150 కేజీల కాపర్ వైరును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. దీని విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని తెలిపారు. దొంగతనం చేసిన ముగ్గురితోపాటు వీటిని కొన్న వ్యక్తితో కలిపి నలుగురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

డెకాయిటీ కేసును ఛేదించిన పోలీసులు

- ఐదుగురు దొంగల అరెస్ట్
- రూ.6 లక్షల విలువ చేసే 23 సెల్‌ఫోన్లు, 2 మోటార్ సైకిళ్లు స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఎం.వెంకటరమణ

కావలి రూరల్: ఫిర్యాదు చేసిన గంటల వ్యవధిలోనే డెకాయిటీ కేసును పోలీసులు ఛేదించి ఐదుగురు దొంగలను అరెస్ట్ చేసి, 23 సెల్‌ఫోన్లు, 2 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్న ఘటన శనివారం కావలి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ ఎం.వెంకటరమణ నిందితుల వివరాలు వెల్లడించారు. కావలి పట్టణంలోని కచ్చేరిమిట్టకు చెందిన పాశం యశ్వంత్ తన స్నేహితుడు కస్తిపాటి భాస్కర్‌రెడ్డితో కలిసి ఈ నెల 14న తన టాటామ్యాజిక్ ఆటోలో కావలి రైల్వేస్టేషన్ నుంచి 10 మంది ప్యాసింజర్స్‌ను ఎక్కించుకుని కావలిరూరల్ మండలం తుమ్మలపెంట బీచ్‌కు బాడుగకు వెళ్లారు. సముద్రంలో మునిగేందుకు ప్యాసింజర్లు తమ లగేజి, 19 సెల్‌ఫోన్లు కవర్‌లో ఉంచి యశ్వంత్ వద్ద ఉంచారు. యశ్వంత్ స్నేహితుడు కస్తిపాటి భాస్కర్‌రెడ్డి కూడా అతని వద్ద ఉన్న 2 సెల్‌ఫోన్లు అతనికి ఇచ్చి సముద్రంలో మునిగేందుకు వెళ్లాడు. ఈ సమయంలో బోగోలు మండలం విశ్వనాథరావుపేటకు చెందిన గుర్రంకొండ సాల్మన్, బోగోలు మండలం బేతానిపేటకు చెందిన మల్లి పృథ్వీశ్వరరావు, చెంచులక్ష్మీపురానికి చెందిన కట్టా మనోహర్, కావలిలోని బాలకృష్ణారెడ్డినగర్‌కు చెందిన చెన్నంశెట్టి కుమార్, జనతాపేటకు చెందిన పాలకీర్తి సుబ్రహ్మణ్యం ద్విచక్రవాహనాలపై వచ్చి ఆటోడ్రైవర్ యశ్వంత్‌ను బెదిరించి అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్లు దోచుకెళ్లారు. వెంటనే యశ్వంత్ ఈ విషయాన్ని ప్యాసింజర్లకు తెలియజేసి కావలిరూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు శనివారం ఉదయం కావలి జాతీయ రహదారి వద్ద మాగుంట పార్వతమ్మ గెస్ట్‌హౌస్ సమీపంలో నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించిన కావలి రూరల్ సీఐ ఎం.రాజేష్, ఎస్సై సుమన్, సిబ్బందిని అభినందించారు.

రంగడి ఆలయంలో అవకతవకలు

- ఏసీబీ తనిఖీల్లో వెలుగులోకి..

నెల్లూరు(క్రైమ్): శ్రీతల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో ఆరు రోజులపాటు ఏసీబీ అధికారులు క్షేత్రస్థాయిలో నిర్వహించిన తనిఖీల్లో రూ.కోట్లలో అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది. కొన్నేళ్లుగా ఫిక్స్‌డ్ డిపాజిట్లకు వచ్చే వడ్డీతో పాటు బంగారు, వెండి ఆభరణాలను కాజేశారు. శనివారంతో సోదాలు ముగియడంతో ఆయా వివరాలను ప్రభుత్వానికి నివేదించనున్నారు. వివరాల్లోకి వెళ్లితే.. నగరంలోని శ్రీతల్పగిరిరంగనాథస్వామి ఆలయంలో నిధులు దుర్వినియోగంపై ఏసీబీ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో ఏసీబీ డీఎస్పీ మోహన్ నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్లు రమేష్, వేణు, కిరణ్, జీఎల్ శ్రీనివాసరావు తమ సిబ్బందితో ఈ నెల 13 నుంచి ఆలయంలో తనిఖీలు చేపట్టారు. విరాళాలు, ధూప, దీప, నైవేద్య ఖర్చులు, ఉత్సవాలు లీజ్‌లు, బంగారు, వెండి ఆభరణాలు, ఆస్తులు, మాన్యాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఇలా అన్నింటిపై సోదాలు నిర్వహించి అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. తొలుత బంగారం, వెండి ఆభరణాలను పరిశీలించగా సుమారు 250 గ్రాముల బంగారు, ఒకటిన్నర కేజీ వెండి ఆభరణాలు మాయమైనట్లు బహిర్గతమైంది. 2009 నుంచి ఇప్పటి వరకు ఫిక్స్‌డ్ డిపాజిట్లకు వచ్చే వడ్డీ రూ.5.20 కోట్ల మేర కాజేసినట్లు వెల్లడైంది. బ్రహ్మోత్సవాల్లోనూ అనేక పనులకు టెండర్లు పిలవకుండానే నిర్వహించారు. ఇలా దాదాపు రూ.7.50 లక్షలు అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. త్వరలో నివేదికను అధికారులు ప్రభుత్వానికి అందించనున్నారు.

ప్రకటన

నెల్లూరు సిటీ, లక్ష్మీపురం కాపురస్తులయిన శ్రీ దువ్వూరు సురేంద్రనాథ్ రెడ్డి, తండ్రి సుందరరామిరెడ్డి మరియు శ్రీ దువ్వూరు నిఖిల్ రెడ్డి తండ్రి సురేంద్రనాథ్ రెడ్డి గార్లు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని శ్రీ అమరా శ్రీరాములు తండ్రి చెన్నయ్య మరియు శ్రీ చీమకుర్తి రాజగోపాల్ తండ్రి శ్రీరాములుశెట్టి గార్ల వద్ద నుండి కొనుగోలు చేయుటకు గాను తీర్మానించుకొనినారు. దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని వారు మహమ్మద్ ఇమాదుద్దీన్ అహ్మద్ మరియు సలాహుద్దీన్ గార్లు రాజేందర్ బావేజ వగైరాల వల్ల జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ పొందిన ఏజెంట్ హరీష్ ఖరేలందా గారి వద్ద Doct. Nos.4632/1991 మరియు 7028/1991 ల ద్వారా కొనుగోలు చేసినారనియు సదరు మహమ్మద్ ఇమాదుద్దీన్ అహ్మద్ మరియు మహమ్మద్ సలాహుద్దీన్ గార్లు ఎం.షహాబుద్దీన్ అలియాస్ ఐషీర్ గారికి Doct No.1052/1991 మరియు 142/1992 ల ద్వారా జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ ఇచ్చినారనియు. సదరు ఎం.షహాబుద్దీన్ అలియాస్ ఐషీర్ గారు సదరు మహమ్మద్ ఇమాదుద్దీన్ అహ్మద్ మరియు మహమ్మద్ సలాహుద్దీన్ గార్ల GPA ఏజంట్‌గా దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని అమరా శ్రీరాములు మరియు చీమకుర్తి రాజగోపాల్ గార్లకు Doct No.4554/2004 అను విక్రయపత్రం ద్వారా విక్రయించి చెంత చేయగా దిగువ షెడ్యూలు ఆస్తి సదరు అమరా శ్రీరాములు మరియు చీమకుర్తి రాజగోపాల్ గార్లకు పూర్తి హక్కులతో సంక్రమించి వారి స్వాధీనానుభవములో ఉన్నదనియు తెలియజేయుచున్నారు. కావున దిగువ షెడ్యూలు ఆస్తిపై ఎవరికైనను ఎటువంటి హక్కులు గాని, అనుమానములు గాని మరి ఏ ఇతర అభ్యంతరములు ఉన్న యెడల దిగువ అడ్రస్‌కు 10 దినములలోగా వ్రాతపూర్వకమైన ఆధారములతో తెలుపగలరు. లేనియెడల నా కక్షిదారులు దిగువ షెడ్యూలు ఆస్తిని కొనుగోలు చేసెదరు. తదుపరి వచ్చు అభ్యంతరములు నా కక్షిదారులకు బద్ధగించవు.

షెడ్యూలు

SPSR నెల్లూరు రి॥డి॥ నెల్లూరు స॥రి॥ నెల్లూరు మునిసిపాలిటీలో చేరిన నెల్లూరు బిట్-2 గ్రామములోని కోరుమెట్ట సర్వే నెం.1194/1 మరియు 1198/1లు భూమి యిండ్ల ప్లాట్లుగా లేఅవుట్ చేయబడిన ప్లాను దాఖలా నెం.1రు ప్లాటు 202 అంకణములు లేక 1351.178 చ.మీ స్థలమునకు హద్దులు. తూర్పు: పంటకాలువ అవల గవర్నమెంటు వారి భూమి, దక్షిణం: చీమకుర్తి శంకరప్రసాద్ గారి స్థలం, పడమర: అనుమాలశెట్టి విజయ గారి స్థలం కొంతవరకు, గవర్నమెంటు వారి స్థలం కొంతవరకు. ఉత్తరం: పొరుదల కాలువ.

యీ హద్దులలోని 202 అంకణములు స్థలమున్నూ యావత్తు యీజిమెంట్ హక్కులతోటి

Counter Signed by:
దువ్వూరు సురేంద్రనాథ్ రెడ్డి
దువ్వూరు నిఖిల్ రెడ్డి

యస్.శ్రీనివాసమూర్తి B.A., B.L.,
అడ్వకేట్
16/1065, Trunk Road, Nellore.

ఉరేసుకొని విద్యార్థి ఆత్మహత్య

గుడ్లూరు: పరీక్షల్లో ఫెయిల్ అవుతాననే అనుమానంతో డిగ్రీ విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని చెంచిరెడ్డిపాళెంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన నరాల వెంకటేశ్వర్‌రెడ్డి పెద్ద కుమారుడు ఉదయ్‌కిరణ్‌రెడ్డి (21) ఒంగోలులోని ప్రైవేట్ కళాశాలలో బీకాం చదువుతున్నాడు. ఇటీవల డిగ్రీ ఫైనలియర్ పరీక్షలు రాసి ఇంటికి వచ్చాడు. ఎంబీఏ చేయడానికి పలు కాలేజీల్లో ఫీజుల వివరాలు కూడా తెలుసుకున్నాడు. అయితే గత కొన్ని రోజుల నుంచి ఉదయ్‌కిరణ్‌రెడ్డి ఇంటి వద్ద ముభావంగా ఉంటున్నాడు. పరీక్షల్లో ఫెయిల్ అవుతానేమోనన్న అనుమానంతో క్షణికావేశంలో శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పొలం నుంచి రాత్రి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు గమనించగా తలుపులు వేసి ఉండడంతో కిటికీలో నుంచి చూశారు. ఉదయ్‌కిరణ్‌రెడ్డి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో తలుపులు పగలగొట్టి కిందకు దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. చేతికి అంది వచ్చిన కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న సీఐ సుబ్బారావు, ఎస్సై ప్రసాదరెడ్డి శనివారం గ్రామంలోకి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి : రూ.25
సన్నవి : రూ.12
పండ్లు : రూ.5

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 126
లేయర్ (లైవ్)	: 92
బ్రాయిలర్ చికెన్	: 220
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 244
లేయర్ చికెన్	: 156